క్లుప్తంగా

క్రైస్తవ మఠకన్యలపై అక్రమ కేసులకు నిరసన



పెనమలూరు: ఛత్తీస్‌ఘడ్‌లో క్రైస్తవ మఠకన్యపై అక్రమ కేసులకు నిరసనగా కానూరులో సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్మెల్‌మాత పుణ్యక్షేత్రం ఫాదర్ విచారణ గురువు సలివేంద్రశౌరి మాట్లాడుతూ రాజ్యాంగంలో ఉన్న క్రైస్తవ హక్కుల కోసం పోరాటం చేస్తామన్నారు. ఇద్దరు మఠకన్యలను అక్రమంగా అరెస్టు చేయటాన్ని ఆయన ఖండించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు హరించే అధికారం ఎవ్వరికీ లేదన్నారు. ఈ సందర్భంగా కార్మెల్‌మాత చర్చి నుంచి కామయ్యతోపు అంబేద్కర్ విగ్రహం వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పూడికతీత పనుల పరిశీలన

కంకిపాడు: మురుగు సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. కంకిపాడు పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టిన డ్రెయినేజీ పూడికతీత పనులను సోమవారం ఆయన పరిశీలించారు. హరికృష్ణ మాట్లాడుతూ డ్రెయిన్లలో వ్యర్థాలు పేరుకుపోయి మురుగునీరుపారుదల సజావుగా సాగటం లేదన్నారు. దోమలు విజృంభించి ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. క్రమం తప్పకుండా డ్రెయిన్ల పూడికతీత పనులు చేపట్టాలన్నారు. దోమల నిర్మూలన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు, చిట్టూరి నాగేశ్వరరావు, పులి శ్రీనివాసరావు, బాజీ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప గుడి నిర్మాణానికి శంకుస్థాపన



పెనమలూరు: స్థానికంగా అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సోమవారం శంకుస్థాపన చేశారు. గ్రామంలో వంతెన డౌన్‌లో అయ్యప్ప భక్త బృందం, గ్రామస్తుల సహకారంతో అయ్యప్పస్వామి గుడి నిర్మాణం చేపట్టారు. పెనమలూరు గ్రామంలో గత 40 సంవత్సరాలుగా భక్తులు అయ్యప్పస్వామి దీక్షలు చేసి అయ్యప్పస్వామి అన్న సమారాధన కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. భక్తుల కోసం అయ్యప్పస్వామి ఆలయం నిర్మించాలని గ్రామస్తులు ముందుకు రావటంతో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీంతో అయ్యప్ప ఆలయ నిర్మాణానికి వేదమంత్రాలతో ఘనంగా శంకుస్థాపన మహోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ ప్రతిష్ట ఉత్సవాలు ప్రారంభం

గన్నవరం: స్థానిక యాదవుల రామాలయం ఆవరణలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణస్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరగనున్న ఈ వేడుకను ఉదయం గోపూజ, గణపతిపూజతో ప్రారంభించారు. అనంతరం దీక్షాధారణ, అఖండ దీప స్థాపన, ప్రతిష్టామూర్తులకు నవవిధ ద్రవ్యాభిషేకం, జలాధివాసం నిర్వహించారు. సాయంత్రం గణపతి, లక్ష్మీగణపతి హోమాలు, క్షీరాధివాసం జరిపారు. పలువురు యాదవ సంఘ నాయకులు, ఆలయ నిర్మాణ కమిటీకి చెందిన సభ్యులు పాల్గొన్నారు.

యూరియా కొరతపై రైతుల ఆందోళన



హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కానుమోలులో యూరియా కొరతపై రైతులు ఆందోళన చేపట్టారు. సోమవారం గ్రామంలోని రైతు సేవా కేంద్రం ఎదుట రైతులు పెద్ద ఎత్తున గుమ్మిగూటి నిరసన వ్యక్తం చేశారు. సకాలంలో యూరియా సరఫరా చేయకపోవటంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని రైతులు వాపోయారు. తరుణానికి ఎరువులు వేయకపోతే ఇబ్బందులు వస్తాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు దీనిపై తక్షణమే స్పందించి, రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణం యూరియా అందుబాటులోకి తేవాలని రైతులు ఈ సందర్భంగా కోరారు. ప్రస్తుతం యూరియా స్టాకు లేదని, మరో రెండు, మూడు రోజుల్లో స్టాకు వచ్చే అవకాశం ఉందని రైతు సేవా కేంద్రం అధికారులు చెప్పారు.

దోచుకోవడమే చంద్రబాబు నైజం

- పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి
- కంకిపాడులో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి

కంకిపాడు: చంద్రబాబుకి తెలిసింది దోచుకోవడం, దాచుకోవడమేనని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి ఆరోపించారు. బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం, వైఎస్సార్ సీపీ మండల ఆత్మీయ సమావేశం సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి మాట్లాడుతూ మహానేత వైఎస్సార్ తీసుకొచ్చిన ఆరోగ్యశ్రీతో అన్ని వర్గాలకు మెరుగైన వైద్యం అందిందన్నారు. కూటమి ప్రభుత్వం రోగ్యశ్రీకి చెల్లించాల్సిన సొమ్ము చెల్లించకుండా చేయడంతో దిక్కుమాలిన పాలన నేడు రాష్ట్రంలో సాగుతుందన్నారు. ఉద్యోగాలు కల్పిస్తామంటూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వలంటీర్ల ఉద్యోగాలు పోగొట్టి ఉసురు పోసుకుందన్నారు. రైతులను నిర్లక్ష్యం చేస్తూ సంక్షేమాన్ని విస్మరిస్తున్నారన్నారు. రైతు సేవా కేంద్రాలను నిర్వీర్యం చేసేశారని ఆరోపించారు. నియోజకవర్గంలో జగనన్న చొరవతో 20 వేల మందికి ఇళ్ల స్థలాలు అందాయన్నారు. అన్ని వర్గాలకు సంక్షేమాన్ని చేరువ చేసిన ఘనత జగనన్నదే అన్నారు. గ్రామ స్థాయిలో జరుగుతున్న అవినీతిపై ప్రజలను చైతన్యం చేయాలన్నారు. పార్టీ శ్రేణులను కాపాడుకుంటూ పార్టీని బలోపేతం చేయాలన్నారు. కూటమి మోసాలను ప్రజలకు వివరించి చైతన్యం చేయాలనీ పిలుపునిచ్చారు.

అవినీతిపై బహిరంగ చర్చకు సిద్ధం

పెనమలూరు నియోజకవర్గంలోని ఇసుక రీచ్‌లలో జరుగుతున్న ఇసుక అక్రమ వ్యాపారంపై బహిరంగ చర్చకు సిద్ధమని చక్రవర్తి అన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా అడ్డగోలుగా దోచుకుంటున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే బోడే ప్రసాద్ దమ్ముంటే అవినీతిపై చర్చకు రావాలని బహిరంగ సవాల్ విసిరారు. పిల్ల బచ్చాలు అంటూ పిచ్చి ప్రేలాపనలు మానుకోవాలని హెచ్చరించారు. తన రాజకీయ ప్రస్థానం నీతి నిజాయితీలతో సాగితే, ఎమ్మెల్యే బోడె ప్రస్తానం అవినీతి అక్రమాలతో మొదలైందని విమర్శించారు. పార్టీ మండల అధ్యక్షురాలు మాదు శ్రీహరిరాణి మాట్లాడుతూ చంద్రబాబు మోసాలను తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బాకీ బాబు, రాష్ట్ర నేత రామినేని రమాదేవి, నక్కా శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధి సత్తా వెంకటేశ్వరరావు, నియోజకవర్గ నేతలు పి.రాఘవరావు, పిడికిటి రామకోటేశ్వరావు, మాగంటి శ్రీనివాసరావు, బందెల సుబ్బారావు, మేదంద్రావు కుటుంబరావు, వైస్ ఎంపీపీ కలపాల ప్రకాష్, ఎంపీటీసీలు ఒడుగు శ్రీనివాస్, తోకల ఉమాదేవి, నాయకులు కాగిత రాజా రమేష్, కె.జోజ్ మేరీ, కొండవీటి సుబ్బారావు, మాదు రాఘవేంద్ర రావు, జె. నాగేశ్వరరావు, నర్రా రమేష్, తంబాబత్తుల ఓంకారం తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై విద్యుత్ చార్జీల భారం ఆపాలి



వణుకూరు పంచాయతీ వద్ద నిరసన

పెనమలూరు: ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపుతూ కూటమి ప్రభుత్వం ప్రజలనడ్డి విరుస్తోందని మండల సీపీఎం కార్యదర్శి షేక్ కాశిం ఆరోపించారు. వణుకూరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కాశిం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ట్రూఅప్ చార్జీల పేరుతో విద్యుతచార్జీలు పెంచారన్నారు. విద్యుత్ వాడక పోయినా విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయని విమర్శించారు. విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో రూ.16 వేల కోట్లు ప్రజలపై భారం మోపారని అన్నారు. కొత్తగా స్మార్ట్ విద్యుత్ మీటర్లు బిగించే యత్నం చేస్తున్నారని, స్మార్ట్ మీటర్లు బిగిస్తే ప్రజలు విద్యుత్ బిల్లులు చెల్లించలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. గ్రామ పంచాయతీ ఈవో పద్మావతికి వనతిపత్రం అందజేశారు. జువ్వనపూడి వెంకటేశ్వరరావు, జోషి, అనీల్, వేణు పాలువురు పాల్గొన్నారు.

కంకిపాడు: విద్యుత్ భారాలపై ఉద్యమించాలని కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు పిలుపునిచ్చారు. మండలంలోని ఉప్పలూరు గ్రామంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కరపత్రాలను సోమవారం పంపిణీ చేశారు. రంగారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హయాంలో అడ్డగోలుగా విద్యుత్‌చార్జీల దోపిడీ జరుగుతుందన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పా టుతో వినియోగదారులకు నష్టం వాటిల్లుతుందన్నారు. భవిష్యత్తులో విద్యుత్ సంస్థను ప్రైవేటు పరం చేసే కుట్ర సాగుతుందన్నారు. ఐక్యవేదిక ప్రతినిధులు టి.నరేష్, సీహెచ్‌వి రెడ్డయ్య, ఎం.చంటిబాబు, వీ రమేష్, దానియేలు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలి



సదస్సులో మాట్లాడుతున్న టెక్ మహీంద్ర ప్రతినిధి శ్రీనివాసరెడ్డి

రామవరప్పాడు: ఉన్నత విద్య, అంతర్గత నైపుణ్యాలు మెరుగుపరుచుకున్న విద్యార్థులకు ఉద్యోగాలిచ్చేందుకు ఎంఎన్‌సీ కంపెనీలు అన్వేషిస్తున్నాయని టెక్ మహీంద్ర ఉద్యోగ నియామక ముఖ్యఅధికారి వి.శ్రీనివాసరెడ్డి అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం 'ఉన్నత ఉద్యోగాల సాధన' అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఉన్నత విద్య ఎంత అవసరమో నైపుణ్యాలు కూడా అంతే అవసరమన్నారు. ప్రముఖ కంపెనీలు అర్హత కలిగిన విద్యార్థులకు ఉద్యోగాలిచ్చేందుకు ఎదురు చూస్తున్నాయని, కార్పొరేట్ కంపెనీలకు తగ్గట్టుగా విద్యార్థులు తమకు తాము మలుచుకోవాలని సూచించారు. మొదటి సంవత్సరం నుంచే సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు, పరిశోధనాత్మక దృష్టి, సృజనాత్మకతను పెంపొందించుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఏకాంబరం నాయుడు మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీల అవసరాలకు తగ్గట్టుగా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. వర్క్ షాపులు, సదస్సులు, ల్యాబ్‌లను నిర్వహిస్తూ విద్యార్థులకు అవగాహన తీసుకొస్తున్నామన్నారు. టెక్ మహీంద్ర నుంచి జయపాల్, కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి శివ, పలు విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో శ్రీపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. శ్రావణమాసం సందర్భంగా చండీహోమం చేశారు. సాయంత్రం స్వామివారికి పంచహారతులు, పల్లకీసేవ అత్యంత వైభవంగా చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ నిర్మాణ దాత సంగా నరసింహారావు, ఈవో ఎన్.భవాని భక్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై పని భారం తగ్గించాలి



కంకిపాడు: అంగన్‌వాడీ కార్యకర్తలపై పని భారం తగ్గించాలని సీఐటీయూ జిల్లా నేత తాడంకి నరేష్ డిమాండ్ చేశారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కంకిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ మానసిక ఒత్తిడితో కార్యకర్తలు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యకర్తలు తమ వద్ద ఉన్న ఫోన్లు ట్యాబ్‌లు అందజేసేందుకు కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా ఐసీడీఎస్ సిబ్బంది కార్లయ్య గేట్లు మూసివేసి అడ్డుకున్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వై.నళినీకుమారి, ఎం.రేవతి, వై.లక్ష్మీప్రసన్న, విజయలక్ష్మి, హసీనాబీ, మేరా బి.కనక రత్నం తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేపై గ్రామ సభ

హనుమాన్‌జంక్షన్ రూరల్: భూముల రీ సర్వేలో ఎలాంటి పొరపాట్లు లేకుండా, భూరికార్డులను నమోదు చేయాలని మండల ప్రత్యేక డెప్యూటీ తహసీల్దార్ వీఎస్‌వీ రాజేందర్ అన్నారు. బాపులపాడు మండలం కానుమోలులోని పీఏసీఎస్ ప్రాంగణంలో రెవెన్యూ అధికారులు భూముల రీ సర్వేపై రైతులతో సదస్సు నిర్వహించారు. ఇటీవల గ్రామంలో 14 మంది సర్వేయర్లుతో రీ సర్వే నిర్వహించామని చెప్పారు. రీ సర్వే ద్వారా నమోదు చేసిన రికార్డుల వివరాలను సదస్సులో వెల్లడించారు. రీ సర్వేలో భూయాజమాని వివరాలు, భూ విస్తీర్ణంలో ఏవైనా పొరపాట్లు దొర్లినా, మార్పులు, చేర్పులు ఉన్నా రైతులు అర్జీలు సమర్పించాలని రాజేందర్ కోరారు. రైతుల నుంచి అభ్యంతరాలను స్వీకరించారు. వీఆర్వో విక్టర్, మాజీ సర్పంచ్ చింతల వెంకట శివ అప్పారావు పాల్గొన్నారు.

15న వరలక్ష్మి వ్రతాలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో శ్రావణమాసం పురస్కరించుకుని ఈనెల 15న ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.ప్రియాంక తెలిపారు. ఆమె సోమవారం మాట్లాడుతూ పూజలో పాల్గొనే భక్తులు కలశ ఏర్పాటుకు చెంబు, కొబ్బరికాయ, రవికల వస్త్రం, ఉద్దరిణె, పంచపాత్ర వంటి పూజా వస్తువులు తమ వెంట తెచ్చుకోవాలని సూచించారు. దేవస్థానం వారిచే పసుపు, కుంకుమ, గాజులు, ప్రసాదము అందజేస్తామని వివరించారు. ఈ సామూహిక వ్రతంలో పాల్గొనుదలచిన భక్తులు ఉదయం 8 గంటలకు ఆలయానికి చేరుకోవాలని సూచించారు.

ఆకతాయిలపై చర్యలు తీసుకుంటాం

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఆర్టీసీ బస్టాండ్‌లో ఆకతాయిలపై చర్యలు తీసుకుంటామని హనుమాన్ జంక్షన్ ఎస్‌ఐ వి.సురేష్ హెచ్చరించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో అకతాయిల ఆడగాలపై తరుచూ ఫిర్యాదు అందటంతో ఎస్‌ఐ సురేష్ సోమవారం తనిఖీ నిర్వహించారు. బస్టాండ్‌లో ఎటువంటి పని లేకపోయిన, ప్రయాణం చేయకపోయినా కొందరు యువకులు నిత్యం విద్యార్థులు, ప్రయాణీలతో అసభ్యకరంగా ప్రవర్తించటంపై కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ హెచ్చరించారు. బస్టాండ్‌లో సంచరిస్తున్న అకతాయిలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ద్విచక్రవాహనాలతో బస్టాండ్ ప్రాంగణంలోని వచ్చిన మైనర్లను హెచ్చరించారు.

బాస్కెట్‌బాల్ కోర్టులు, స్కేటింగ్ గ్రౌండ్ ప్రారంభం



స్కేటింగ్ గ్రౌండ్ ప్రారంభోత్సవంలో అలెక్స్, డీఎస్‌డీఓ, ప్రిన్సిపాల్

గన్నవరం: స్థానిక వీఎస్.సెయింట్‌జాన్స్ మాధ్యమికోన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన మూడు బాస్కెట్‌బాల్ కోర్టులు, స్కేటింగ్ గ్రౌండ్‌ను సోమవారం క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. తొలుత ఈ నూతన క్రీడా ప్రాంగణాన్ని మాంట్‌ఫోర్ట్ ప్రావిన్సియల్ సుపీరియర్ రెవ.బ్రదర్ షైన్ అలెక్స్ ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. క్రీడల్లో రాణించడం ద్వారా ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ పొందవచ్చని తెలిపారు. ఈ దిశగా విద్యార్థులను ముందుకు నడిపిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో బాస్కెట్ బాల్ కోర్టులను, స్కేటింగ్ గ్రౌండ్‌ను నిర్మించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ రెవ.బ్రదర్ సంతోష్‌కుమార్ అధ్యక్షతన బాస్కెట్ బాల్ జిల్లా అధ్యక్షుడు బోస్, కార్యదర్శి డి.సత్యనారాయణ, పాఠశాల డైరెక్టర్ రెవ.బ్రదర్ బాలశౌరి, సీనియర్ బ్రదర్ జిమ్మికురియోకోస్, రెవ. బ్రదర్ భల్లా జోసఫ్, రెవ.బ్రదర్ జయబాలన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

పెనమలూరు: బైక్‌పై నుంచి పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటన పై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. కానూరుకు చెందిన దండమూడి వెంకటరామారావు (69) ఈ నెల 1వ తేదీన పెనమలూరు వద్ద బైక్‌పై వెళుతున్న సమయంలో వెనుక వచ్చిన వాహనం బిగ్గరగా హారన్ కొట్టగా కంగారుపడి రామారావు రోడ్డుపై పడ్డాడు. ఈ ఘటనలో అతనికి గాయాలు అవటంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్సకై చేర్చారు. అక్కడ చికిత్స పొందుతున్న అతను ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెనమలూరు: విజయవాడ– అవనిగడ్డ కరకట్టపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలు అవటంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదపులిపాకకు చెందిన ఫిర్యాది గుండిమెడ కనకదుర్గ తన భర్త దుర్గాప్రసాద్‌తో కలిసి ఫంక్షన్‌కు వెళ్లింది. ఇంటికి తిరిగి వచ్చే సమయంలో దర్గాప్రసాద్‌కు పని ఉండటంతో అదే గ్రామానికి చెందిన కె.సాంబయ్యను తన భార్య కనకదుర్గను ఇంటి వద్ద దించమని కోరాడు. దీంతో సాంబయ్య తన బైక్‌పై కనకదుర్గతో పెదపులిపాకకు బయలు దేరాడు. వారు కరకట్టపై గ్రామం వద్దకు రాగా వెనుక నుంచి వచ్చిన కారు వారి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న సాంబయ్య, కనకదుర్గ రోడ్డుపై పడిగాయపడ్డారు. వారిని విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్సకై చేర్చారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ముర్రుపాలలో వ్యాధి నిరోధకశక్తి అధికం



వణుకూరులో మాట్లాడుతున్న సీడీపీవో బేబీసుకన్య



తల్లిపాల గురించి వివరిస్తున్న సీడీపీఓ మంగమ్మ

గన్నవరం: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ జీ మంగమ్మ ప్రసూతి వార్డును సందర్శించి తల్లిపాల విశిష్టతను బాలింతలకు వివరించారు. బిడ్డ ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తల్లిపాలు దోహదపడతాయని చెప్పారు. బిడ్డకు పాలు ఇవ్వడం వల్ల తల్లులకు గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ వంటి వ్యాధుల బారిన పడకుండా నియంత్రించవచ్చని చెప్పారు. ప్రసవం అయిన గంటలోపే బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యవణి, అంగన్‌వాడీ కార్యకర్తలు తులసి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలతో బిడ్డకు ఆరోగ్యం

పెనమలూరు: తల్లిపాలు బిడ్డుకు ఎంతో శ్రేష్ఠమని, బిడ్డ ఆరోగ్యంగా పెరగటమే కాకుండా తల్లి క్యాన్సర్‌బారిన పడకుండా ఉంటుందని ఐసీడీఎస్ సీడీపీవో కె.బేబీసుకన్య అన్నారు. వణుకూరు అంగన్‌వాడీ 1, 2 కేంద్రాలలో సోమవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. తల్ల పాలు పుట్టిన బిడ్డకు వెంటనే ఇవ్వటం వలన బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తల్లులు కూడా పాలు ఇచ్చే విషయంలో నిర్లక్ష్యం చేస్తే రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. తల్లి పాలు బిడ్డకు ఇవ్వటం వలన తల్లి, బిడ్డ క్షేమంగా ఉంటారని తెలిపారు. సూపర్‌వైజర్ ఎల్.సులోచనారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు బి.కాశేశ్వరిదేవి, పి.అనిత, పి.రంగమ్మ, కె.శిరీష, కె.శ్రీలేఖ, వి.జ్యోతి, తల్లులు పాల్గొన్నారు.

యనమలకుదురులో..

యనమలకుదురు ప్రియదర్శినినగర్‌లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సూపర్‌వైజర్ కల్యాణివర్మ తల్లి పాల ప్రాముఖ్యతను తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కె.మాధవి, శాంతకుమారి, జయశ్రీ ,శైలజ, కుమారి, తల్లులు పాల్గొన్నారు.

కంకిపాడు: తల్లిపాల ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ రెహానాబేగం సూచించారు. మండలంలోని తెన్నేరు గ్రామ పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను సోమవారం నిర్వహించారు. రెహానాబేగం మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే అర్ధగంట లోపు తల్లి ముర్రుపాలు బిడ్డకు అందించాలన్నారు. ఆరు నెలల వరకూ కేవలం తల్లిపాలు మాత్రమే ఆహారంగా అందించాలని సూచించారు. ముర్రుపాలల్లో వ్యాధినిరోధక శక్తి అధికంగా ఉంటుందని, పిల్లలు చురుకుగా ఎదగటానికి తల్లిపాలు దోహదపడతాయన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ముత్తమ్మ, జ్యోతి, శబరి, మల్లేశ్వరి,కోటేశ్వరమ్మ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

- ప్రొద్దుటూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో సూపర్‌వైజర్ ఎస్.అన్నామణి తల్లిపాల విశిష్టతను వివరించారు. తల్లిపాలు ఇవ్వటం వల్ల తల్లికి ఆరోగ్య సమస్యలు తలెత్తవన్నారు. రొమ్ముక్యాన్సర్, అధిక రక్తస్రావం, ఊబకాయం వంటి అనారోగ్య సమస్యలు దరిచేరవని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నున్న గ్రామంలో..

నున్న(విజయవాడరూరల్): తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం నున్న గ్రామంలో 3వ నంబరు అంగన్‌వాడీ కేంద్రంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లులు, కార్యకర్తలు కోటేశ్వరమ్మ, పి.లలిత, విజయరాణి, సుధారాణి, శ్యామలరాణి, రత్నకుమారి, జ్యోతి ,శ్రావణి, వరమ్మ, దేవరాణి, అంగన్‌వాడీ ఆయాలు పాల్గొన్నారు.

పెద్దఅవుటపల్లి(గన్నవరం): ఉంగుటూరు మండలం పెద్దఆవుటపల్లి గ్రామంలో సోమవారం గన్నవరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. తల్లిపాల విశిష్టతను వివరిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ కరిముల్లా మాట్లాడుతూ.. తల్లిపాలు వల్ల బిడ్డల్లో రోగ నిరోదక శక్తి పెరుగుతుందన్నారు. పుట్టిన గంటలోపు నుంచి ఆరు నెలలు వరకు తల్లిపాలనే బిడ్డకు ఆహారంగా అందించాలని సూచించారు. డాక్టర్ శాస్త్రి, సూపర్‌వైజర్‌పద్మాదేవి, ఏఎన్‌ఎం సౌదామణి తదితరులు పాల్గొన్నారు.

మెడికల్, హెల్త్, డెంటల్ ఎగ్జిబిషన్ ప్రారంభం



డెంటల్ కళాశాల ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న దృశ్యం

గన్నవరం రూరల్: మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో మెడికల్ అండ్ హెల్త్ ఎగ్జిబిషన్‌ను, డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాలలో ఎక్స్ ఫ్లోర్–25 ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మానవ దేహంలో నిరంతర ప్రక్రియలు, మార్పులు, నిర్మాణం అవగాహనకు ఎగ్జిబిషన్‌లు గీటు రాయిగానిలిచాయన్నారు. మెడికల్ కళాశాల ప్రిన్సి పాల్ డాక్టర్ ఎంవీ భీమేశ్వర్ వివిధ విభాగాల ప్రదర్శనల విశేషాలను ఎమ్మెల్యేకు వివరించారు. డెంటల్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు, ఆధునిక దంత వైద్యం ద్వారా పేదలకు తక్కువ ఖరీదుతో నాణ్యమైన వైద్యం అందిస్తున్నామన్నారు.గైనకాలజీ విభాగంలో డాక్టర్ పిన్నమనేని సిద్దార్థ వైద్య కళాశాల బోధన ఆస్పత్రి సేవలను కొనియాడారు. హెచ్‌వోడీ సజన, వైద్యుల సేవలను వివరించారు. అకాడమి అధ్యక్షుడు మలినేని రాజయ్య, కార్యదర్శి లక్ష్మణరావు, డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, ట్రెజరర్ సూర్రెడ్డి వెంకటేశ్వరరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్‌కుమార్, డైరెక్టర్ డాక్టర్ సీవీ రావు, డెప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.కళ్యాణి, లలిత్ ప్రసాద్, డాక్టర్ స్వాతి పూర్ణిమ, డాక్టర్ అజయ్ బెనర్జి, డాక్టర్ కాశేశ్వరరావు, డాక్టర్ రాజగోపాల్, ఏవో వై.మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు. తొలిరోజు 700 మంది విద్యార్థులు ఎగ్జిబిషన్‌లు సందర్శించారు. చిగురుపాటి కృష్ణవేణి స్కూల్, సెయింట్ జాన్స్ గుణదల, వివేక వర్ధిని, రామకృష్ణ మిషన్, ప్రజ్ఞ పాఠశాలల విద్యార్థులు,ఉపాధ్యాయులు ఎగ్జిబిషన్‌లలో పాల్గొన్నారు.